రావచ్చు. అక్కడ ఏం కట్టినా దానికి 'లిబర్టి' అన్న పేరు పెడతారని ఆశిస్తాను. ఏ.జి. ఆఫీస్, సెక్రటేరియట్, ఎల్.ఐ.సి., రిజర్వ్ బాంక్ లాంటి చుట్టుపక్కల కార్యాలయాల్లో పనిచేసే వాళ్ళల్లో ఇంగ్లీష్ సినిమాలని నేను చూసిన 'పర్మిషన్' పద్ధతిలో చూసేవాళ్ళకి పెద్ద దెబ్బే. ఒక్క వాళ్ళకేకాదు లిబర్టి చావు ఇంగ్లీష్ సినిమా గోయర్స్‌కే కాక, హైదరాబాద్ వాసులందరికి లోపం కిందే లెక్క. వేసవిలో లిబర్టిలో మేట్నీ చూసి, నాలుగు నిమిషాలు నడక దూరంలో వున్న టేంక్ బండ్ కి వెళ్ళి కూర్చుని సేదతీర్చుకునే ఆదివారాలు ఎన్నో. ఇక మీదట అలాంటి ఆదివారాలు జంటనగర వాసులకి వచ్చే అవకాశం లేదు.

చిక్కడపల్లి, నారాయణగూడ, హిమాయత్‌నగర్, అశోక్‌నగర్, ఆదర్శనగర్.... ఇలా లిబర్టి చుట్టు పక్కల గల అనేక పేటల్లోని వారికి ఎంతో సేవచేసిన లిబర్టి లేకపోవడం పెద్దలోపమే. రెండో ఆటచూసి ఇంటికి నడిచి వెళ్ళడానికి ఇక లిబర్టి లేదు.

చివరగా ఓ ఎలిజీ. అమెరికాలో లిబర్టి స్టేచ్యూ వున్నంతకాలం హైదరాబాద్‌తో లిబర్టి పేరు నిలిచి వుంటుందని ఆశిస్తాను.

# మనస్తత్వాన్ని తెలిపే మీసాలు ఎట్సెట్రా

ఫ్రాయిడ్ పుణ్యమా అని మనస్తత్వ శాస్త్రం బాగా అభివృద్ధి చెందింది. విదేశాల్లో, ముఖ్యంగా అమెరికాలో ప్రతి మనిషి జీవితంలో ఓసారయినా సైకియాట్రిస్ట్ దగ్గరకి వెళ్ళకుండా వుండరు. కొందరు తరచు వెళ్తుంటారు. మెడికల్ ప్రొఫెషన్‌లో అమెరికాలో ఎక్కువ ఆర్జించేది సైకియాట్రిస్ట్‌లే,

సైకియాట్రిస్ట్‌లు తరచు కొన్ని విషయాల్లో పరిశోధన చేసి

మనుషులని వర్గీకరిస్తూంటారు. తమ ఫలితాలని ప్రకటిస్తూంటారు. అమెరికన్స్ ఆ సైంటిఫిక్ థియరీలని నమ్ముతుంటారు. కాని మన ఇండియన్స్‌కి అవి ఎంతో హాస్యంగా వుంటాయి.

చాలా కాలంగా అలాంటి థియరీలని సేకరిస్తున్నాను. వాటిలో కొన్ని యివి.

డాక్టర్ మార్విన్ జిపోరిన్ అనే ఇల్లినాయిస్ సైకియాట్రిస్ట్ ప్రతిపాదించిన థియరీ యిది. మీ నర్వస్ అలవాట్లు మీ చేతిలో పెన్సిల్ ముందో పేడ్ వుండి, మీరు ఖాళీగా వుంటే బయటపడతాయి. ఖాళీగా కూర్చుని పెన్సిల్‌ని పేడ్‌మీద సుతారంగా కొడుతుంటే, మీరు మంచి భోజనాన్ని యిష్టపడేవారు. అలాగే సెక్స్‌ని, మందుని, సంగీతాన్ని యిష్టపడేవారయి వుంటారు. అలా కాక పెన్సిల్‌తో ఏవయినా పిచ్చి గీతలని పేడ్‌మీద గీస్తూంటే మీరు ప్రతి వస్తువుని తీసిన చోటే వుంచుతారు.

అలాగే మీలో మీరు మంద్రస్థాయిలో హమ్ చేసే వారయితే లేదా మృదువుగా విజిల్ వేసే వారయితే మీరు రొమాంటిక్ అడ్వెంచరర్ అయే మనిషట. కొత్త రుచుల కోసం తాపత్రయ పడేవారు ఏ చిన్న అనుభవంతోనయినా త్వరగా విసిగిపోయి తిరిగి కొత్తదనం కోరుకునే వారూనూ. అలాగే జుట్టుని కాని, మీసాన్ని కాని తిప్పుకునే అలవాటు గలవారు తాము ఎదుటివారికి ఎలాటి ఇంప్రెషన్ యిస్తున్నామా అని అధికంగా ఆలోచించే వారయి వుంటారు.

మీరు పేపర్ క్లిప్ కనబడితే చాలు దాన్ని వంచి తీరుతారు. లేదా రైల్లో తాగేసిన పేపర్ కప్‌ని నలిపి కాని పారేయరు. లేదా పేపర్‌ని వుండలా చుడతారు. బీర్ కేన్స్ తాగే అలవాటుంటే, తాగాక దాన్ని నలపకుండా వుండలేరు. ఈ అలవాటున్నవారు లీడర్ క్వాలిఫికేషన్స్ గలవారు, కోపధారి మనుషులు, తమకి వ్యతిరేకతని చూపించే మనుషులంటే అయిష్టం గలవారు.

డాక్టర్ మార్విన్ కొన్ని సంవత్సరాల పాటు అనేక వేల మందిని పరిశీలించి, ఇంటర్వ్యూ చేసి ఆయా పనులు చేసేవాళ్ళు ఈ రకాలు అనే

నిర్ధారణకి వచ్చాడు. ఇందులో నిజం వుందో లేదో మిమ్మల్ని మీరు పరిశీలించి తెలుసుకోండి అని ఛాలెంజ్ కూడా చేసాడాయన. మరో ప్రొఫెసర్ ఆల్‌ఫ్రెడ్ ఏడ్‌లర్ మనిషి నిద్రపోయే లక్షణాలని పరిశీలించి వారి స్వభావాలని తెలుసుకోవచ్చని ఓ థియరీని ప్రతిపాదించాడు.

మంచం మీద వెల్లకిలా పడుకుని కాళ్ళు చేతులు బారచాపి వుంచి నిద్రపోయేవారు సంఘంలో ప్రాముఖ్యత కలిగి వుండాలని, గొప్పవాడుగా గుర్తింపబడాలని కోరుకుంటాడుట. అదే ముడుచుకుని, మోకాళ్ళని ముక్కుకి ఆనించిన విధంగా పడుక్కునే వాడికి ధైర్యం లేకపోగా ఆత్మన్యూనతా భావం కలిగినవాడై వుంటాడుట. అదే పొట్టమీద బోర్లా పడుక్కునే వాడు ఏ విషయంలోనయినా వ్యతిరేకిగా వుండటమే కాక, గట్టి పట్టుదల కలవాడై వుంటాడు. నిరాశావాదులు ముసుగుతన్ని తలనించి కాలి వేళ్ళదాకా కప్పుకుని పడుకుంటారుట.

మరో యిద్దరు అమెరికన్ సైకలాజిస్ట్‌లు మనిషి ధరించే వాచీని బట్టి ఆ మనిషి స్వభావం అంచనా వేయవచ్చని పరిశోధించి కనుక్కున్నారు. మనిషి ధరించే చేతి గడియారం ఒక్క సమయమే కాక, అతని స్వభావాన్ని కూడా తెలియచేస్తుందన్న మాట. వాచీకి చుక్కలు బదులు ఒకటి నుంచి పన్నెండు దాకా అంకెలుంటే అతను చాలా జాగ్రత్త స్వభావం గల మనిషి. త్వరగా కొత్త ఐడియాలని స్వీకరించడు.

అదే వాచీ సమయంతో పాటు, తారీకు, వారం, సంవత్సరం కూడా చూపించినట్లయితే దాన్ని ధరించే వ్యక్తి కొత్త పరికరాలని వెంటనే కొని వుపయోగించేవాడు, అడ్వెంచరస్ మేన్ అయి వుంటాడు. కంప్యూటర్ లేదా ఎలక్ట్రానిక్ వాచ్ ధరించే వాడయినా యిదే కోవకి చెందినవాడు. అదే వాచీకి అలారం వుంటే, మీతోటి మనుషులు తగిన నిర్ణయం కోసం మీ దగ్గరికి వస్తూంటారు. అదే మికీమౌస్ బొమ్మగల వాచీనో అమెరికన్ డాలర్ మీద ముళ్ళు తిరిగే వాచీనో లేదా అలాంటి తమాషా వాచీనో ధరించే వారు 'కేర్ ఫ్రీ'గా వుండే రకం. ఎంత

క్లిష్టమయిన సమస్యలో పడ్డా సరదాగా నవ్వుతూ ఉండగల స్థయిర్యం గలవాడు, హాస్యప్రియుడు అయి వుంటాడు.

ఒకవేళ డయల్ మీద ఎలాంటి నంబర్లులేని పక్షంలో ఇంటలెక్చువల్ మార్పులు కోరుకునే వ్యక్తి. సమస్యలని సాధించడమే అతనికి ఆనందాన్ని కలిగిస్తుంది. అసలు చేతి గడియారమే లేదనుకోండి. మీరు పదేళ్ళలోపు కుర్రాడయినా అయి వుంటారుట. లేదా మనిషి ఎదిగినా మనసు ఎదగని 'యంగ్–ఎట్–హార్ట్' టైప్ అయి వుంటారుట.

నా వరకు నా వాచీ విషయంలో నా స్వభావం నిజం కాదు. ఎందుకంటే నా వాచీ నేకొన్నది కాదు. ఓ ఫిల్మ్ డైరెక్టర్ నాకు ప్రెజంట్‌గా యిచ్చింది.

మీసాల మీద కూడా ఈ రకం అనాలసిస్‌ని తయారు చేసారు. అది సురేశ్ చోప్రా అనే మన భారతీయుడే చేసాడు. మీసాల్ని అయిదు రకాలుగా విభజించాడతను. సైకిల్ హేండిల్ బార్ ఆకారంలో వుండే మీసాలు గలవారు మృదుస్వభావులు, మందుభాయిలు, స్త్రీలకోసం అర్రులు చాచేవారు అయివుంటారు. ఇంకా లేని గొప్పలు కూడా చెప్పుకుంటారు. మీసాలు కుంగిపోయినట్టుగా కిందకి వేలాడుతుంటే, వారు అనవసరంగా వుద్రేకపడే మనుషులు, క్రూర స్వభావులు, యింకా కీర్తి, డబ్బు దాహం ఎక్కువట.

బట్టలు తగిలించే హేంగర్ ఆకారంలో మీసాలు పెంచేవారు ప్రేమకి ప్రాణం యిస్తారట. హింసని అసహ్యించుకోవడమే కాక ప్రయాణాలని యిష్టపడతారు. టూత్‌బ్రష్ మీసాలున్నవారు అహంకారులు, కష్టపడి పనిచేసి పేరు తెచ్చుకోవడమేకాక ప్రజా నాయకులయ్యే లక్షణాలుంటాయి.

పెన్సిల్‌లా మీసాలు పెంచేవారు తమ కుటుంబ వ్యక్తుల కోసం ప్రాణం పెడతారుట. ఓవర్ ఆల్‌గా మీసాలు పెంచే వాళ్ళకి ధనం విషయంలో అత్యాశ, స్వతంత్ర భావాలు ఎక్కువట. అసలు మీసాలు పెంచని వారి గురించి ఏమీ కామెంట్ చేయలేదా సురేష్ చోప్రా.

ఓ బ్రిటిష్ డాక్టర్ టైని బట్టి మనిషిని అంచనా వేయవచ్చంటాడు.

ప్లెయిన్‌గా వుండే టై వాడేవాడు సామాన్యుడు, వృత్తిలో పైకి ఎదగ లేడు. చుక్కలున్న టైని తొడిగే వాడు జల్సా పురుషుడు. అన్ని 'మ'కారాలకి లొంగినవాడు. అడ్డగీతలున్న టైని ధరించేవాడు సమస్యలని పరిష్కరించాలని, ఫ్రాంక్‌గా వుండాలని ఇష్టపడే వాడు. అదే కుడినించి ఎడమవైపుకి కిందకి దిగినట్లుగా గీతలుంటే అతను అవకాశవాది. తన సౌఖ్యం కోసం మిత్రులకి కూడా ద్రోహం చేయగలవాడు. అదే గీతలు ఎడమనించి కుడివైపుకి దిగివుంటే ఎప్పుడూ వూహల్లో తేలే రచయితో కళాకారుడో అయి వుంటాడు. సర్వమానవ సౌభ్రాతృత్వం కోరుకునే వ్యక్తి టైమీద చుక్కలు చిన్నవిగా వుంటాయి. కుందేలులాంటి బొమ్మ కుట్టివున్న టైని వేసుకునే వ్యక్తి సౌశీల్యుడు, సౌమ్యుడు, తన కుటుంబ సభ్యులనే అధికంగా ప్రేమించేవాడు.

ఇలా యింకా ఎన్నో రకాల విధాలుగా మనస్థత్వాలని అంచనావేసే పద్ధతులని రూపొందించారు డాక్టర్స్. అగ్గిపెట్టెలోంచి పుల్లని ఏ వైపు నించి తీసి, ఏ చేత్తో ఎలా, సిగరెట్‌కి ఎంత దగ్గరగా లేదా దూరంగా వెలిగిస్తాడో దాన్నిబట్టి; కారు నిడిపే పద్ధతిని బట్టి, కాఫీ ఏ రకంగా తాగుతాడో అంటే చక్కెర ఎక్కువా, తక్కువా, పాలు కలుపుకుంటాడా కలుపుకోడా, ఎంత టైంలో తాగుతాడు మొదలయిన వాటిని బట్టి, దుస్తుల రంగుని బట్టి, నడిచే విధానాన్ని బట్టి, మేగజైన్స్‌ని చదివే పద్ధతిని బట్టి.... ఇలా ఎన్నో దైనందిన కార్యక్రమాలని బట్టి పరిశీలించి, పరిశోధించి స్థూలంగా ఈ రకం మనిషి ఈ రకంగా వాటిని వుపయోగిస్తాడు అన్న ప్రతిపాదనలని చేసారు.

మీసాల్ని బట్టో లేదా పడుక్కునే విధానాన్ని బట్టో మీ లైఫ్ పార్టనర్, బంధు మిత్రులు, పుత్ర రత్నాలు ఎట్సెట్రా ఎలాంటి వారో అంచనావేసి యిందులో నిజం వుందో లేదో గమనించండి.

అది సరదా టైంపాస్ ఆట అవుతుంది మీకు.